46.

# జీవితమనే వృక్షానికి ప్రేమయే వేరు

ప్రేమ మయుండు శ్రీధరుడు ప్రేమయె ఆతని దివ్యరూపమౌ
ప్రేమయె సర్వమానవుల ప్రీతికి తారకమంత్రమట్టి స
త్ప్రేమ రవంతయైన వివరింపగలేక జగంబునందు త
త్కామిత సత్పదార్థమెటు గాంచగనేర్తురటయ్య మానవా!

ప్రేమస్వరూపులారా!

**జీవితమనే వృక్షానికి ప్రేమయే వేరు**

ప్రేమ ఈనాటి మానవుడు ఉపయోగించేటువంటి పదమునకు అనేక విధములైనటువంటి అర్థాలు గుర్తించుకుంటూ వస్తున్నారు. పుట్టిన ప్రతి శిశువు కూడాను తానెవరో, తానెక్కడనున్నాడో, తాను ఎందుకోసం పుట్టాడో అనేటువంటి విషయములు ఏమాత్రం కూడను తెలియనటువంటి ఆ శిశువు ప్రప్రథమములో తల్లిని ప్రేమిస్తున్నాది. ఇది ఏది? ఎందుకు? అనేటువంటి విషయము కంటే ప్రేమ చాలా ఉత్తమమైనటువంటిది అని ఆ శిశువే జగత్తుకు ప్రబోధిస్తూ వస్తుంది. ప్రేమ ప్రతి మానవుని హృదయంనుండి మొట్టమొదట ప్రేరేపించేటువంటిదే. ఈ ప్రేమ ప్రేరేపణ తర్వాతనే అన్ని సంకల్పములు కూడాను, ఆవిర్భవిస్తుంటాయి. మానవుని హృదయంనుండి ఆవిర్భవించేటువంటి మొట్టమొదట శబ్దం ప్రేమ. మానవ జీవితంనకు జీవితమనే వృక్షంనకు ఈ ప్రేమనే వేరు, జ్ఞానమే దీని ఫలం అని ఉపనిషత్తులు చాటుతూ వచ్చాయి. కాని నా ఉద్దేశం ఒకటి వేరు, రెండవది ఫలం అని విభజించటము చాలా సరియైనటువంటిది కాదు. మానవ జీవితమే ప్రేమమయం. జీవితమే ప్రేమ, ప్రేమనే జీవితం.

**అందరినీ ప్రేమించేవాడు దైవప్రేమకు పాత్రుడవుతాడు**

ఒకానొక సమయంలో ఒక భక్తుడు జీసస్ దగ్గరికి వచ్చి ప్రభూజీ! నన్ను నేను రక్షించుకోవడానికి ఏ పని చెయ్యాలి? ఏది నన్ను నేను రక్షించుకోవడానికి సహాయం

sri sathyasai vahanamrutam

చేస్తుంది అని ప్రశ్నించాడు. పిచ్చివాడా! సర్వులను రక్షించేవాడు భగవంతుడే అట్టి ప్రేమమయమైన భగవంతుని నీవు ప్రేమిస్తూ పోతే, ఆ ప్రేమనే నిన్ను రక్షిస్తుంది అన్నాడు. అదే విషయమును భగవద్గీతయందు కూడాను అర్జునుడు ప్రశ్నించాడు. కృష్ణా! నీకు ఎవరిపైన అభిమానము అధికము? ఎవరంటే నీకు ప్రీతి? అని ప్రశ్నిస్తాడు. ఎవరు నన్ను నిశ్చలముగా, నిస్వార్థముగా దృఢమైన విశ్వాసంతో ప్రేమింతురో వారే నా సన్నిహితులు అన్నాడు. అట్టి ప్రేమతత్త్వాన్ని దృష్టియందుంచుకొని అందరియందు ఉండినటువంటి ప్రేమతత్త్వం ఒక్కటే అనేటువంటి సత్యాన్ని గుర్తించి సర్వులను ప్రేమిస్తూ ఉండేటటువంటివానిపై నాకు అమితమైనటువంటి అభిరుచి. అటువంటివాడే నా ప్రియశిష్యుడు అన్నాడు. ప్రేమ సాధించలేనటువంటిది జగత్తులో ఏదియును లేదు. కఠినమైన క్రోధాన్ని కూడాను ప్రేమ సాధిస్తుంది. చల్లబరుస్తుంది. అసూయ, డంబము, క్రోధము ఇత్యాది కౄర భావములు కూడను చల్లార్చేటువంటిది ఒక్క ప్రేమ మాత్రమే ప్రేమను, అమృతమునకు ప్రక్కలో ఉంచినపుడు ఈ అమృతము ప్రేమకంటే మధురమైనటువంటిదిగా కనిపించదు. బుద్ధుడు ప్రయాణం చేయుచున్న సమయమునందు అసూయా పరుడైనటువంటి ఒక రాక్షసుడు ఎదురొచ్చి, బుద్ధుడా! ఈనాడు నాకు ఆహారంగా నీవు సిద్ధంగా ఉండు అని కత్తినెత్తాడు. బుద్ధుడు ఫక్కున నవ్వి. ఓ అసూయా రాక్షసి. నిన్ను కూడా నేను ప్రేమిస్తున్నాను అన్నాడు. ఈ ప్రేమ అనేటువంటి పదము వినగానే ఆ అసూయా రాక్షసి కూడా మార్పు చెంది శాంతికి చిహ్నంగా ఒక పావురము ఆకారము ధరించి ఎగిరిపోయింది. ప్రేమ పదమును వినగానే ఇన్ని మార్పులు కల్గుతున్నప్పుడు ప్రేమనే కల్గినపుడు ఇంక ఎన్ని మార్పులు మనము కల్గించుకోవచ్చును. కనుక ఈ జగత్తునందు దేనిని మనము సాధించవలెనన్నను ప్రేమచేత సులభంగా మన వాంఛలు నెరవేర్చుకోవచ్చును. దైవాన్నే సాధించ కల్గినటువంటి ఈ ప్రేమ శక్తికి ఈ జగత్తునందు సాధించలేనటువంటిది ఏమిన్నది? ఈ ప్రేమకు ఐదు పేర్లున్నవి. మొదటిది శాంతము, రెండవది దాస్యము, మూడవది వాత్సల్యం, నాల్గవది సఖ్యము, ఐదవది మాధుర్యము. ఇవన్నీ కూడను ప్రేమకు పర్యాయ పదములే. శాంతము ప్రేమకు ఎట్లా పర్యాయ పదమవుతుంది అని విచారించవచ్చును. శాంతి అంటే ఏమిటి? ఎవరు ఎన్ని

sri sathyasaivachanamrutam

అన్నప్పటికిని బదులు చెప్పక, నోరెత్తక కేవలం మౌనంగా ఉండటం శాంతం అని భావిస్తున్నాము. అది కాదు శాంతం. మానవునియందు ఉన్నటువంటి దుర్గుణములు, దురాలోచనలు, దుశ్చర్యలు, దుర్భావములు ఇలాంటి క్రూరమైనటువంటి భావాలను ఏనాడు తన హృదయంనుండి వేరు చేయునో అట్టి స్థితికే శాంతము అంటారు. ద్వేషము నిర్మూలం గావించుకున్న తర్వాత ఉండేటువంటి హృదయభావమునకే శాంతం అంటారు. సమత్వం, సమైక్యత, సౌభ్రాతృత్వం కల్గినటువంటి హృదయమునకే శాంతము అంటారు. అనగా ఈ దుర్గుణములను మనం దూరం గావించుకున్నప్పుడు మిగిలేది ఒక్కటే. అదియే దివ్యత్వమైనటువంటి దైవత్వం. దీనిని వేదాంత పరిభాషయందు అనేక విధములుగా వర్ణిస్తూ వచ్చారు.

**తన్ను తానెఱుగడమే మోక్షం**

మానవుడు ఈ జగత్తునందు తెలుసుకోవలసినటువంటి విషయములు ఎన్నియో ఉంటున్నవి కాని ఇన్నింటిని వదలిపెట్టి వేదాంతము, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు ఇత్యాది మహా పవిత్రమైన గ్రంథములన్నీ కూడను 'పనివర్తే వివక్ష స్వవిమర్శే మోక్షః' అన్నారు. తనను తాను గుర్తించుకున్నటువంటిదే మోక్షం అని బోధించింది. స్వవిమర్శ, స్వవిమర్శ. తనను తాను విమర్శించుకోవట మేమిటి? నేను ఎవరు? నేనెవరు? నేనెవరు? అనేటువంటి విమర్శనా భావమే మొట్టమొదట మనం తెలుసుకోవాలి. అదే మోక్షం అన్నారు.

ప్రపంచంలో ఎన్నియో పదార్థములు ఉన్నాయి తెలుసుకోవటానికి. ఎన్నియో విషయములున్నాయి తెలుసుకోవటానికి. ఇన్నింటినీ వదలి నిత్యజీవితంలో ఉపయోగించుకొనేటువంటి నేను అనేటువంటి పదం తెలుసుకోవటం ఏమంత గొప్పదా? ఈ 'నేను' అనేటువంటి పదం యావత్ ప్రపంచమంతా కూడను, బ్రహ్మాండమంతా వ్యాపించి యుంటుంది. 'I' ఒకే అక్షరమే 'ఏకం ఏవ అద్వితీయం బ్రహ్మ'. దీనికంటే రెండవది ఇంకొకటి లేదు బ్రహ్మ. కనుకనే సర్వమూ ఈ నేను అనేటువంటి ఒక్క పదంబునందున మాత్రమే ఇమిడి ఉంటున్నది. భగవద్గీతయందు ప్రతి అడుగులో కూడాను 'మామేకం'



srisathyasaivachanamrutam

అన్నాడు. ఈ ఏకత్వాన్ని శరణం. 'మామేకం శరణం వ్రజ', 'మోక్ష యిష్యామి మాశుచః' నేను అన్నాడు. ప్రతి పదంనందు కూడాను నేను, నేను, నేను అనేటువంటి పదమును ఉపయోగిస్తూ వచ్చాడు. ఈ నేను అనేటువంటి పదం ఇంత గొప్ప శక్తివంతమైనటువంటిది. కోటీశ్వరుని మొదలు కూటిపేదవరకు, పండితుని మొదలు పామరుని వరకు, అజ్ఞాని మొదలు ప్రజ్ఞాని వరకు, తనను తాను ప్రకటించుకునే సమయంలో తనను తాను చెప్పుకునేటువంటి సమయంలోపల 'నేను' అనేటువంటి పదము రాకుండా రెండవ పదం వారు ఉపయోగించుకోలేరు. 'నేను వచ్చాను', 'నేను పోతున్నాను', నేను చూచాను', నేను విన్నాను', 'నేను మాట్లాడుతున్నాను' ఈ అన్నింటియందు కూడాను 'నేను' అనేటువంటిది ఏకంగా ఉంటుంది. ఈ 'నేను' అనేటువంటిది ఏమిటి? అదియే వేదాంతంనందు రెండే రెండు పదములు. ఇది, నేను ఈ రెండే ముఖ్యమైనటువంటివి. ఇది, ఏమి? కర్చీఫ్. ఇది ఏమి? గ్లాసు. ఇది ఏమి? టేబుల్. ఇతనెవరు? ఒక మనిషి. ఇది ఏమిటి? ఒక భవనము. అంత ఇది, ఇది, ఇది అనేటువంటిది లేకుండా ఏ ఒక్క పదార్థాన్ని కూడాను మనం చర్చించేందుకు కాని, చూచుటకు కాని, విచారించుటకు కాని వీలు కాదు. ఈ దృశ్యకల్పితమైన జగత్తు అంతయును కూడా 'ఇది' అంతే, మాటలు రాని పిల్లవాడు కూడా అమ్మతో చెయ్యి పట్టుకొని వెల్లుతున్నప్పుడు అమ్మా! ఏమిటి 'ఇది'? ఏమిటి ఇది? ఏమిటి ఇది? అని ఇది, ఇది, అని ఉపయోగిస్తూ ఉంటాడు. అమ్మా! 'ఇది' ఎందుకు? అంతా ఇది 'ఇది' అని అనగా దృశ్యకల్పితమైనటువంటి జగత్తుకు 'ఇది' అని పేరు. 'ఇది' దృశ్యము ఈ దృశ్యంను చూచేటువంటి నేనే ద్రష్ట. 'నేను' అనేటువంటి వాడు ద్రష్ట.

జగత్తంతా దృశ్యమే దేనినైనా నీవు చూడు? దేనినైనా విను? దేనినైనా చదువు? దేనినైనా పట్టు? దేనినైనా చెయ్యి. అంతా ఇదియే అయితే ఇక్కడ రెండు విధములైనటువంటి శాస్త్రంలు ప్రబోధిస్తూ ఉన్నాయి. భౌతికమైనటువంటి శాస్త్రము ఏమిటి? ఆధ్యాత్మిక శాస్త్రం ఎందుకు? అయితే వేదాంత శాస్త్రము రెండింటియొక్క చేరికనే ఉంటుంది. 'ఎందుకు' అనేటువంటి ప్రశ్న కూడా వేదాంతంలో వస్తుంది. 'ఏమిటి' అనేటువంటి ప్రశ్న కూడను భౌతికంలో వస్తుంది. భౌతిక శాస్త్రం, వేదాంత శాస్త్రం రెండూ చేరినటువంటిదే 'ఏమిటి', 'ఎందుకు' అనేటువంటి దీనికి జవాబులు. కాని ఈనాటి భౌతిక శాస్త్రం. ఏమిటి, ఏమిటి ఈ

భూమి తిరుగుతున్నాదని మాత్రమే చెప్పుచున్నాడు. కాని సైంటిస్ట్ దేనికోసం తిరుగుతున్నాదని చెప్పలేదు. ఇది సూర్యుని చుట్టూ తిరుగుతుండాది. ఎందుకు తిరుగుతున్నాది. జవాబు లేదు. రాత్రివేళ చుక్కలు వెలుగుతున్నాయి. పగటివేళ చుక్కలు వెలగటం లేదు చెప్పగలుగుతున్నారా! ఎందుకోసం వెలగటం లేదు? కనుకనే ఎందుకు అనేటువంటి ఎవ్వరు కూడాను చెప్పటానికి వీలు కానటువంటి పరిస్థితి. ఇది ఒక్క ఆధ్యాత్మికం మాత్రమే సులభంగా దీనిని తీర్చగలదు. అయితే, ఈ ఏమిటి?, ఎందుకు? కూడాను ఉన్నది ఒక్కటే. ఒక చిన్న ఉదాహరణము. రాములు అని పేరు కలిగినటువంటి వాడు రావణుడు అనేటువంటి వేషం వేసుకున్నాడు. కాని ఈ ధరించినటువంటి వేషంతో కూడినటువంటి రావణుడు వేదికపైన రావణుని వలె నటన చేస్తున్నాడు. కాని, రావణునివలె నటన చేస్తున్నప్పటికిని, రాములు సాక్షీభూతుడుగానే ఉన్నాడు. నటన చేసేదంతా కూడను రావణుడే. నటన చేసినంతమాత్రమున రాముడు రావణుడు కాలేదు. రావణుడుయందు కూడా రాముడు ఉన్నాడు కాని రాములు యందు రావణుడు లేడు. కనుక ఈ విశ్వ జగత్తునందు, ఈ విశ్వనాటకరంగం నందు జగత్తంతా ఒక విధమైనటువంటి వేషం ధరించి అనేక విధములైనటువంటి నటన జరుపుతున్నాది. అయితే ఈ అన్నింటియందు కూడను 'ఆత్మ' అనేటువంటిది సాక్షీభూతంగానే ఉంటుంది. ఈ రావణుడు చేసేటువంటి చెడ్డ పనులకు కాని లేక తపస్సంపన్నమైనటువంటి మంచి పనులకు కాని. ఈ రాముడు ఏమాత్రం సంబంధించినటువంటి వాడు కాదు జీవితమే ఒక నటన చేసేటువంటి దృశ్యం. మానవుడు ఒక నటన సూత్రధారి. కానీ తానే భోక్త, తానే కర్త, తానే అన్నీ అని భావిస్తున్నాడు కాని రాముడు నేను కర్త, నేను భోక్త అనేటువంటిది ఏమాత్రం అక్కడ ఉచ్చరించడు. తాను సాక్షీభూతుడే. అదే విధముగనే ఈనాడు జగత్తులో మనం చూస్తున్నటువంటి సర్వము కూడను ధరించిన వేషములే. ఇవన్నీ కేవలం ఆధారములే. దేనికి ఆధారములు? జగత్తుకు మాత్రం ఆధారములు. కాని జగత్తుకు ఏది ఆధారము? అదియే ఆత్మ. ఈ జగత్తంతా కూడాను కేవలం ఒక భౌతికమైన శాస్త్రంతో కూడినటువంటిది. దీనికి సాక్షీభూతుడైనటువంటి ఆత్మస్వరూపుడే. దీనికి ఆధ్యాత్మికతత్త్వంతో కూడినటువంటి వాడు.

ఒక్క విషయాన్ని మనం చక్కగా గుర్తించాలి. ఈ ఆధ్యాత్మికతత్త్వం అనేది. 25

srisathyasaivachanamrutam

తత్త్వములతో కూడినటువంటిది. ఏమిటి ఇవి? 5 కర్మేంద్రియములు, 5 జ్ఞానేంద్రియములు, 5 ప్రాణములు, 5 కోశములు, ఇవి 20 అయినవి. మనసు, బుద్ధి, చిత్తం, అహంకారం ఇవి నాలుగు కలిసి 24 అయినాయి. ఈ 24 ఎక్కడనుండి వచ్చాయి. జీవుడు కల్పించుకున్నటువంటివే, మనసు కల్పించుకున్నటువంటివే. కనుకనే కల్పించుకున్నటువంటి జీవుడు 25వ వాడు. ఏనాడు ఇది నేను కల్పించుకున్నటువంటివే. ఇది సత్యం కాదు అని గుర్తించుకొని ఏనాడు ఈ జీవుడు ఈ 24ను త్రోసివేస్తాడో అప్పుడే ఈ జీవుడు దేవునిలో ఏకమైపోతాడు. ఆ 26వ వాడే దేవుడు. ఇంద్రియములంతా కూడాను కేవలం 24. ఈ ఇంద్రియములుయొక్క భోగమునంతా కూడను మనసే కల్పించుకుంటుంది. అన్నీ మనసే కల్పించుకుంటుంది. నీవు రాత్రి వెళ్ళి నిద్రపోతున్నావు. ఈ నిద్రలో ఒక కల వచ్చింది. ఆ కలలో నీవే వున్నావు. నీ స్నేహితులంతా నీతో సినిమా చూస్తున్నారు. నీవు సినిమాలో కూడాను, పిల్లలతో కూడా చేరి నీవు ఒక పిక్నిక్‌కు వెళ్ళావు. కాని ఈ స్వప్నంలోపల ఈ పిక్నిక్ ఏమిటి? ఈ స్నేహితులు ఎవరు? ఈ జడం ఏమిటి? ఇవన్నీ కూడను అనేక దృశ్యములంతా చూస్తుంది. ఇవన్నీ ఎక్కడనుండి వచ్చాయి? మనస్సే సంకల్పించుకుంది. మనస్సే సృష్టించుకుంది. తాను చచ్చినట్టు తానే చూస్తున్నాడు ఆ స్వప్నంలో, ఇది ఎక్కడనుండి వచ్చింది. ఇది ఏ విధంగా సాధ్యం అవుతుంది. ఇది కూడా తానే కల్పించుకున్నాడు. కనుకనే కల్పితములన్నీ కూడా దూరం చేసినప్పుడే సాక్షీభూతుడైనటువంటి భగవంతుడు సాక్షాత్కరిస్తాడు. కనుక ఈ సంకల్పించుకున్నటువంటిది జీవతత్త్వం. అదియే వైబ్రేషన్. ఈ వైబ్రేషన్ అనేటువంటిది రేడియేషన్‌తో ఏకమై ఉంటుంది. అదియే భూర్. ఇది భువః వైబ్రేషన్ ప్రాణం. సువః రేడియేషన్ జ్ఞానం. ఆ రేడియేషన్ అనేటువంటి జ్ఞానం సాక్షీభూతం. దీనినే వేదాంతం ప్రజ్ఞానం బ్రహ్మ అన్నారు. ఇదియే అద్వైతం. ఏమిటి? ఈ కల్పించుకున్నటువంటిదాన్నంతా త్యజించి, ఏది కల్పన కానటువంటి నిత్యసత్యమైనటువంటి దానిని మనం నిరూపిస్తామో అదియే నిజమైన వేదాంతం. అయితే ఆనందం ఎక్కడ ఉంది? నీవే ఆనందం. సత్యం ఎక్కడుంది? నీవే సత్యం. You are the embodiment of Love. You are the embodiment of Peace. You are the embodiment of Truth. You are the embodiment of

sri sathyasai vahini.org

GOD.

నీవు ఎప్పుడు శాంతిగానే ఉండు. ఎందువల్ల? నీవే శాంతియొక్క స్వరూపం. నీవే సత్యంయొక్క స్వరూపం. నీవే ప్రేమయొక్క స్వరూపం. దీనిని ప్రత్యేకంగా ఎక్కడ వెతకగలవు. తానే ప్రేమయై తాను వెతుకుతున్నాడంటే ఇది కేవలం మూర్ఖత్వం. ఒక చిన్న ఉదాహరణము. ఒక వ్యక్తి ఒక గదిలో ప్రవేశించి ఏమిటో అంతా వెతుకుతూ ఉన్నాడు, పాపం. అన్నీ కనిపిస్తున్నాయి ఈ వ్యక్తికి. ఏనాడు చూడనటువంటివన్నీ కూడను కనిపిస్తున్నాయి. కానీ ఒక్కటి కనిపించటం లేదు. ఏమిటి అది? తనను తాను తెలుసుకోవటం లేదు. తనకు తాను కనిపించటం లేదు. ఇంక అన్నీ కనిపిస్తున్నాయి, ఆ గదిలో. అదే రీతిగా ఈనాటి మానవుడు ఈ విశాల ప్రపంచమునందు, దృశ్యకల్పితమైన ప్రపంచమునందు అన్నింటిని వెతుకుతున్నాడు. వెతికినవన్నీ కనిపిస్తున్నాయి కాని వెతికేటువంటి వాడు కనిపించటం లేదు. అదియే వేదాంతంయొక్క రహస్యం. ఏది కావాలని వెతుకుతున్నాడు? సత్యాన్ని అన్వేషణ సల్పుతున్నాడు. కాని సత్యం ఉన్నది. తానే సత్యం. కాని సత్యమును బయట వెతుకుతున్నాడు. తనలో ఉండినటువంటి ఆనందాన్ని బయట వెతికితే మనకు లభ్యమవుతుందా? తన మెడలో హారం వేసుకొని నా హారమెక్కడ? హారమెక్కడ? అని బయట వెతికితే హారం చిక్కుతుందా? తన ముక్కుపైన కంటి అద్దాలు పెట్టుకొని నా అద్దాలు ఎక్కడ, అద్దాలు ఎక్కడ? అని అంటే ఎక్కడ వెతికితే చిక్కుతాయి. అంతా తనయందే ఉంది. తాను బయట వెతుకుతున్నాడు. దీనికి కారణం ఏమిటి? దేహాత్మ బుద్ధియే వీటికన్నింటికి మూలకారణం.

ఈ దేహంపైన నేనే దేహం అనేటువంటి భావం చేతనే ఈ జీవితాన్ని గడుపుతున్నాడు. అందువలననే సత్యమునకు దూరంగా ఉంటున్నాం. మనము అందువలననే ప్రేమకు మరింత దూరంగా ఉంటున్నాం. నాకు ప్రేమ ఉంది, నా తల్లితండ్రులను ప్రేమిస్తున్నాను. నా అక్కతమ్ముళ్లను ప్రేమిస్తున్నాను అనుకుంటున్నావు. ఈ ప్రేమ ప్రేమ కాదు. తల్లితండ్రుల ప్రేమ, భార్యభర్తల ప్రేమ, అన్నాతమ్ముళ్ల ప్రేమ, అక్కాచెల్లెంద్ర ప్రేమ, ఇవన్నింటియందు కూడాను ఇంతో అంతో స్వార్థం అనేటువంటిది ఉంటుంది. కాని స్వార్థరహితమై నటువంటి ప్రేమ ఆత్మ ప్రేమ. తనను తాను ప్రేమించుకునేటువంటి ప్రేమ. తాను అంటే ఎవరు?

దేహం కాదు. తాను తానే, దీనికి ఒక్క ఆకారం లేదు. అదియే మధురమైనటువంటది. ఆ మధురమైనటు వంటి తత్త్వమునే ప్రేమ అని పిలుస్తూ వచ్చారు. ఇందులో షడ్విధములైనటువంటి ప్రేమయందు శాంత భక్తి, సఖ్య భక్తి, దాస్య భక్తి, అనురాగ భక్తి, వాత్సల్య భక్తి, మధుర భక్తి ఆరు. ఈ ఆరింటియందు కట్టకడపటిది మధుర భక్తి. ఈ మధురమును గ్రోలే సమయంలోపల తుమ్మెద తన శక్తినే తాను మర్చిపోతుంది. పిల్లలందరికి కూడా తెలుసును, తుమ్మెద ఉంటుంది. అది కఠినమైనటువంటి కఱ్ఱను కూడాను బాగా రంధ్రం చేసి లోపల ప్రవేశిస్తుంటుంది. ఇంత శక్తి ఉంది. ఈ తుమ్మెద పువ్వులో ఉన్నటువంటి తేనెను గ్రోలే నిమిత్తమై పువ్వు లోపలకి ప్రవేశిస్తుంది. ఆ పువ్వుయొక్క రేకలు చాలా పలచగా ఉంటాయి. కాని సాయంకాలం అయ్యేటప్పటికి అది ముడుచుకుంటుంది. ఆ రేకలు, ఇంత కఠినమైనటువంటి చెక్కను కూడను తొలుచుకొని లోపలకి పోయేటువంటి ఈ శక్తి కల్గినటువంటి తుమ్మెదకు చాలా పల్చనైనటువంటిది, మెత్తనైనటువంటిది, సులభమైనటువంటి ఈ రేకలను మాత్రం తప్పించుకొని బయటకు రాలేకపోతుందే, దేనివల్ల? తన శక్తిని తాను మర్చిపోయింది. అందువల్లనే బంధింపబడిపోయింది.

ఈనాడు ప్రతి మానవుడు కూడా అంతే, తాను ఎవరు? ఆత్మ స్వరూపుడను. తన శక్తిని తాను మర్చిపోతున్నాడే. తన స్వరూపాన్ని తాను మర్చిపోతున్నాడు. అందువలననే జగత్తంతా దుఃఖమయంగా కనిపిస్తుండాది. జగమంతా కూడను అశాంతిమయంగా కనిపిస్తున్నాది. జగత్తులో అశాంతి లేదు. జగత్తులో దుఃఖం లేదు అన్నీ మీయందే ఉన్నాయి. నిన్ను నీవు మరిచిపోయి దేహమే నేను అనుకోవటం చేతనే ఈ కష్టములకు, నష్టములకు, దుఃఖములకు, వాంఛలకు ఇన్ని విధములైనటువంటి దీనికి గురి అయిపోతున్నావు. దేహమే నేను అని భావిస్తున్నావు. అదియే పెద్ద తప్పు. ఇది నా దేహమని చెప్పు తప్పు లేదు. కాని దేహమే నేను అని మాత్రం చెప్పకూడదు. ఇది పరమ విరుద్ధమైనటువంటిది. కన్నులు మూసుకున్నప్పుడు మంచి కాంతిమయమైనట్టి బల్బులు పెట్టుకున్నప్పటికిని చీకటిగానే వుంటాది. సూర్యుడు ప్రకాశిస్తూ కూడను ఉదయిస్తున్నాడు. కాని కన్నులు మూసుకొని సూర్యునివైపుకు చూస్తే ఏమాత్రం మనకు వెలుతురు కనిపించదు. కారణం ఏమిటి? తన

sri sathyasai vahini

కన్నులు తాను మూసుకున్నాడు. అదే విధముగనే జగత్తంతయు కూడను దైవత్వం అనేది ప్రకాశిస్తూ ఉంటుంది. మాధుర్యమైనటువంటి శాంతిని గుర్తించటం లేదు కారణం? దేహాభిమానం అనేటువంటిది కప్పుకున్నాడు. దీనికి ఒక చిన్న ఉదాహరణము. ఒక దీపం పెట్టండి. ఈ దీపము పెట్టి దానికి పది రంధ్రములున్న కుండను మూతగా పెట్టండి. దీపము ఒక్కటే దానియొక్క కాంతి పది రంధ్రములుండడం చేత పది జ్యోతులవలే కనిపిస్తుంది. కుండపైన దట్టమైనటువంటి టవల్ కప్పండి. ఏ జ్యోతి కనిపించదు. జ్యోతి లేదని మనం భావిస్తాం. కాని పది జ్యోతులు కూడా లేవు. ఆ కుండను పగలకొట్టండి. ఒకే జ్యోతి. అదే విధముగనే ఏకాత్మ భావం అనేటువంటి జ్యోతి ఒక్కటే ఉంటుంది. దీనిని పది రంధ్రములతో కూడినటువంటి ఈ దేహమనేటువంటి ఒక కుండ కప్పినాము. ఈ దేహమనేటువంటిది తోలుతిత్తిగా భావిస్తున్నాం. కుండవలె భావిస్తున్నాం. ఎన్ని విధములుగా దీనిని సబ్బుతో పరిశుద్ధం చేసి ఎంత సబ్బు, ఇంకా ఎన్ని రకములుగా పౌడరు, సుగంధములు చల్లినప్పటికిని

**తొమ్మిది చిల్లులుండు తోలు తిత్తియెగాని**
**కాంతి కలుగు వజ్రఘటము కాదు**
**నిముష నిముషమునకు నీచులూరునెగాని**
**పునుగు జవ్వాదీలు పుట్టబోవు.**

ఇదియా మనం, ఇదియా దైవం, ఇదియా ఆత్మ, ఇదియా నేను. కాదు, కాదు. ఇదంతా ప్రాకృత సంబంధమైనటువంటి వాంఛలచేత కప్పబడినటువంటిది. కనుకనే తమో గుణమనేటువంటి దట్టమైనటువంటి టవల్‌ను మొట్టమొదట తీసివేయండి. రెండవది ఈ రజోగుణమనేటువంటి కుండను పగలగొట్టేసేయండి. అప్పుడు భిన్నత్వం పోయి ఏకత్వం మనకు ప్రాప్తిస్తుంది. 'ఏకంసత్ విప్రా బహుధా వదంతి'. ఆత్మ ఒక్కటే ఒక వైపున రజోగుణం, ఒక వైపున తమోగుణం. రెండింటిని కప్పుకొని మనము ఏదీ జ్యోతి, ఏది జ్యోతి ఎక్కడ? జ్యోతి ఎక్కడ? అని విచారిస్తున్నాము. కనుక

**తామసంబు విడక తత్త్వంబు కనరాదు**

srisathyasaivachanamrutam

**రాజసంబు విడక రాదు భక్తి**
**సాత్వికంబె భక్తి సాధనంబగునయా**
**ఉన్నమాట తెలుపుచున్న మాట.**

**రజస్సు, తమస్సు తొలగనిదే సత్వగుణం నిలువదు**

సత్వం సత్వం కావాలి అని ఆశిస్తున్నావు. తామసంబు విడువక సత్వంబు ఎటు కుదురు. రాజసంబు విడువక రాదు భక్తి. రాజసికమనే ద్వేషం, అసూయ, డంబం ఇలాంటి క్రోధము, ఇలాంటి రాజసిక భావాలు మన హృదయంలో నింపుకొని, భక్తి రావాలి, భక్తి రావాలి అని అంటే ఎట్లా వస్తుంది? భక్తి పరమ మధురమైనటువంటిది. భక్తి పరమ సాత్వికమైనటువంటిది, ఇలాంటిది ఈ కఠినంలో ఎట్లా ప్రవేశిస్తుంది. గోవులంతా ఉండినటువంటి మందలోపల పులి పోయి ప్రవేశించిందంటే ఒక్క గోవైనా మిగులుతుందా? ఏమీ మిగలదు. ఈ సాత్వికమైనటువంటివన్నీ మనలో ఉండినప్పటికిని, ఈ రాజసికమైన క్రోదం, ద్వేషం, అసూయ, డంబంలనే పులివంటి కౄరమృగములు ఇందులో ప్రవేశిస్తే. సాత్వికమైన గోవులు ఏమైపోతాయి. కనుకనే నీవు దైవాన్ని పొందాలని గాఢమైన విశ్వాసం, శ్రద్ధ ఉంటే ప్రేమను పెంచుకో. ద్వేషం పెంచుకోవద్దు. ప్రేమ ఉంది. ఆ ప్రేమనే నీయొక్క ప్రాణం. ఆ ప్రేమనే నీయొక్క జీవతము. ఆ ప్రేమనే నీ యొక్క దైవం. ఎట్లా ఆ ప్రేమను మనం తెలుసుకోవాలి? ఆధ్యాత్మిక తత్త్వం ద్వారా తెలుసుకోవాలి. మనసు దేనిని కల్పించుకుంటున్నాదో ఆ కల్పించుకున్నటువంటి దాన్ని దూరం చేయాలి. ఇప్పుడు చూడండి. చిక్కిబక్క పడినటువంటి గోవును అనేక విధములుగా దానికి తగినటువంటి గడ్డి, బూస అంతా అందిస్తుంటే కొంత కాలమునకు బాగా పుష్ఠిగా తయారౌతుంది. ఆ గోవుకు మనం నిత్యం అందించవలసినటువంటి ఆహారం మనం అందించకపోతే అది బక్కపడిపోయి క్రింద పడిపోతుంది. అదే విధముగనే ఈ మనస్సు అనేది అన్ని విధములుగా మానవుని ముంచి వేస్తున్నాది. ఈ మనస్సుకు మనం ఎక్కువ ఘనతను అందిస్తున్నాము. ఈ మనసును మనం ఎక్కువగా గౌరవిస్తున్నాం. ఈ మనసుకు కావలసినటువంటి సదుపాయములు చేస్తున్నాం. ఈ మనసే మన దైవమని భావించి దానికి ఒక పెద్ద సింహాసనంపైన ప్రతిష్ఠించుకుంటున్నాం. కనుక ఈ మనస్సు బాగా దిట్టంగా

srisathyasaivachanamrutam

పెరిగిపోతున్నాది. బాగా బలిసిపోతున్నాది. దానిని అదుపులో పెట్టడానికి ఎవ్వరికి సాధ్యం కాదు. దీనికా మనం అలంకారం చేయవలసింది?

**కోతికి జలతారు కుల్లాయి ఏటికి**
**విరజాజి పూదండ విధవకేల?**

ఈ కోతిని తీసుకొని పోయి సింహాసనంపైన కూర్చోబెడితే అది ఊరుకుంటుందా? కోతికి చంచల బుద్ధి పుట్టినిల్లు, పెట్టిన పేరు. ఆ సింహాసనాన్ని కూడా పాడు చేస్తుంది. అందుకోసమనే తెలుగులో ఒక చిన్న సామెత ఉన్నాది. 'కులికే వాణ్ణి తీసుకొని పోయి బలుకుల్లో పెడితే బలుకులంతా చెడగోలికినాడట'. అనగా కులికేటువంటి వాడు బలకుల్లో పోయిన గాని కునకక మానడు. డాన్సు చేస్తూ ఉంటాడు. ఈ విధంగా monkey, mad monkey ఈ mind. నిరంతరం మనసు, మనసని దీన్ని చింతించడం చేత ఇది మరింత బలసిపోతున్నాది. మనసునే మనము చింతించకూడదు. నీవు కావల్సి వస్తే దైవాన్ని చింతించు. లేకపోతే బుద్ధిని చింతించు. మనసుని ఏమాత్రం మనం చింతించకూడదు. దానిని చింతించడానికి దానికి ఆ అధికారమే లేదు. అధికారమున్న వానిని చింతించిన ఒక ఫలితం ఉంటుంది. కాని ఏముంది? ఈ మనసుకు అధికారం? తుచ్ఛమైనటువంటిది ఈ మనసు, వాంఛలతో చేరినటువంటిది ఈ మనసు. ఎప్పుడు కూడను పెడమార్గం పట్టించేటువంటిదే మనసు. చెడును అభివృద్ధి చేస్తుంది. కనుక మనసును మనం ఏమాత్రం కూడను గౌరవించకూడదు. కనుక మనసును గౌరవించకూడదంటే ఏమి చెయ్యాలి? అదియే Less luggage, more comfort, make travel a pleasure. కోరికలు తగ్గించుకోవాలి.

సంకల్పాలు తగ్గించుకుంటే మనసుయొక్క స్వరూపమే పోతుంది. చూడండి. ఇది బట్ట. ఈ బట్ట దారములయొక్క చేరిక. ఈ దారములయొక్క చేరిక చేత ఇది బట్టగా మనకు కనిపిస్తుండాది. ఈ బట్ట మనకు అక్కరలేదనుకున్నపుడు దీనిని ఏక్కడికో తీసుకొని పోయి. కాల్చేయనక్కరలేదు. ఒక్కొక్క దారం, ఒక్కొక్క దారం, ఒక్కొక్క దారం తీసివేసేయ్. సులభంగా బట్ట అదృశ్యమైపోతుంది. కనుకనే bundle of desires is mind. ఈ desires

sri sathyasai vachanamrutam

ఒక్కొక్కటి ఒక్కొక్కటి తీసేస్తే మనసే వుండదు. దీనినే వేదాంతిక పరిభాషయందు వైరాగ్యము అని చెప్పారు. వైరాగ్యము అనగా ఏమిటి? ఆస్తి, ఆలి, వీడి అడవి కేగుట కాదు. భావమందు దుష్టభావము వీడుటే త్యాగమగును. అదియే యోగమగును. కనుకనే మనసు లేకుండా మనము చేసుకోవాలంటే, మనసును గౌరవించకుండా చూసుకోవాలనుకుంటే కోరికలు తగ్గించుకోవాలి. 'ఇది' జగత్ సంబంధమైనటువంటిదే. 'ఇది' దృశ్యమే. మన దేహము కూడను మనకు ఒక దృశ్యమే. ఈ దేహాన్ని నీవు చూచుకుంటున్నావు కాబట్టి చూచేది ఎవరు? చూచేటువంటి వాడే ద్రష్ట. చూడబడేటువంటిదంతా దృశ్యమే ఈ రూపనామములతో కూడినటువంటి ఈ జగత్తంతా కూడను దృశ్యమే. కనుక ద్రష్ట అనేదే ఆత్మతత్త్వం. అదియే సాక్షీభూతము. అన్నింటికి సాక్షీగా ఉంటున్నాది. ఎట్లా? రావణుడు ఎంత నాటకం ఆడుచున్నప్పటికిని డ్రామా పైన రాముడు అందులోనే ఉన్నాడు. కాని సాక్షీభూతుడుగా ఉన్నాడు ఇద్దరు కాదు మరి వీరు ఒక్కడే. రాముడు రావణుడు వేషం వేసినాడు అంతే. ఆత్మ. జీవాత్మ రెండూ ఒక్కటే. ఆత్మనే జీవాత్మ. వేషం వేసుకొని దృశ్యంగా కనిపిస్తున్నాది. కనుకనే ఈ జగన్నాటక రంగమునందు ఈ జీవుడు ఈ వేషమును వేసి అనేక విధములుగా కూడను నటనను సల్పుతున్నాడు. ఎన్ని విధములు నటనలు సల్పినటప్పటికిని రాముడు సాక్షీభూతుడు గానే ఉన్నాడు. కారణమేమిటి? రాముడు ధరించినటువంటి వేషమే ఈ రావణుడి వేషం. ఈ డ్రస్సును ఏనాడైనా మనం వదిలి పెట్టవలసిందే. కాని రాముడు రాముడు గానే ఉంటాడు. ఈ రావణుడుగా ఉండినప్పుడు గాని, రాముడుగా ఉండినప్పుడు గాని రాములు ఏమాత్రము మారడు. వేషములు మాత్రం మారుతుంటాయి. 'ఇందుకలదు అందులేదని సందేహము వలదు' కనుకనే దైవత్వం అనేది ఒక్కటే. అదియే 'ఏకం సత్' ఉన్నది ఒక్కటే కనిపించేది అనేకము.

ఈ అనేకత్వంలో ఉండిన ఏకత్వాన్ని మనం గుర్తించాలి. ఇదియే సర్వం చేస్తున్నటువంటి పని. కనుకనే 'ఎందుకు' అనేటువంటిది జవాబు చెప్పాలంటే ఆత్మనే. ఎందుకు అవసరమో చెపుతుంది. 'ఏమిటి' అనేటువంటిది జవాబు చెప్పాలంటే భౌతికమైన శాస్త్రమే జవాబు చెబుతుంది. ఇది 'మైకు' ఇది ఎట్లా చేశారు' ఏ విధంగా చేశారు అని చెప్పగలడు. అయితే ఈ 'మైకు'కు ఈ స్టీలు ఉన్నాది. ఈ స్టీలు కూడా ఏ విధంగా చేశారు?

sri sathyasai vahini vachanamrutam

దీనికి మూలాధారమనేటువంటిది ఒకటి ఉన్నాది. మూలాధారం తెలుసుకోకుండా ఈ జగత్తునందు ఏ సైంటిస్టు అయినా ఏ పదార్థాన్ని కూడను నిర్మించలేడు. ఇప్పుడు చూడండి. ఆక్సిజన్ ఉంటుండాది. హైడ్రోజన్ ఉన్నాది. ఇవి ఏ సైంటిస్టు సృష్టించాడు. ఇది దైవంయొక్క సృష్టియే. ఈ వెలుతురునంతా దైవమే సృష్టించాడు. సూర్యచంద్రాదులు దైవమే సృష్టించాడు. ఈ గాలిని దైవమే సృష్టించాడు. జలము, ఆకాశము దైవమే సృష్టించాడు. ఇవన్నీ ఉచితంగా అందించినటువంటివి. ఏమాత్రం వీటికి దైవము ఒక కాసు తీసుకుపోవటం లేదు. కాని దీని ద్వారా కల్పించుకున్నటువంటి పదార్థములకు మనం కనుక్కోవలసి వస్తావుంది. ఇది గ్లాసు ఏమి గ్లాసు? ఇది వెండి గ్లాసు. గ్లాసును ఒకడు చేసినాడు కాని వెండిని ఎవ్వరు చెయ్యలేదు ప్లేటును ఒకరు చేశాడు కాని ఈ ప్లేటులో ఉన్నటువంటి వెండి. ఆధారమైనటువంటి భూతమే. పిల్లలకందరికి చక్కగా అర్థమౌతుంది. లేబరేటరీలోకి పోతారు. లేబరేటరీ లోకి పోయినప్పుడు ఆక్సిజన్ తీసుకుంటారు. హైడ్రోజన్ తీసుకుంటారు రెండింటిని చేరుస్తారు. నీరుగా చేస్తారు. నేను నీరు చేశాను అనుకుంటున్నాడు. నీ మొహం నువ్వేమిటి నీరు తయారు చెయ్యటం. ఈ ఉన్నటువంటి మూలాధారమైనటువంటి హైడ్రోజన్, ఆక్సిజన్ కలిపినావే గాని నీరు చెయ్యలేదు. ఈ ఆధేయాన్ని నువ్వు చేస్తున్నావే కాని. ఆధారమెక్కడ? అదే విధముగనే సర్వమునకు ఆధారము ఆత్మతత్త్వమే. ఉన్నవి రెండే రెండు ఈ జగత్తునందు మనకు కనిపిస్తుండేవి. దృశ్యము. దృక్కు. ఈ రెండింటియొక్క ఏకత్వమే సాధనయొక్క ఫలితము. దృశ్యము దృక్కులో చేరిన, దృక్కు దృశ్యంలో చేరిన ఒక్కటే. కారణమేమిటి? రెండుగా కనిపించేటువంటిది ఒక్కటే! ఒక విత్తనం ఉంది. ఈ విత్తనమునకు రెండు బద్దలు ఉన్నాయి. ఈ రెండు బద్దలు చేరినప్పుడే అది భూమిలో పెట్టినప్పుడు మొక్కగా వస్తుంది. ఈ రెండు బద్దలను వేరు చేసి. నీవు భూమిలో పెట్టు మొక్క రాదు. ఇదే నెగెటివ్ మరియు పోజిటివ్ రెండూ చేరినప్పుడే లైటు మనకు ప్రాప్తిస్తుంది. అయితే నెగెటివ్, పాజిటివ్ ముఖ్యమా, పోజిటివ్ వుంటేనే నెగెటివ్‌ను మనం ప్రయత్నపూర్వకంగా సృష్టించుకుంటున్నాం. కరెంటు లేకపోతే ఈ బల్బులు ఎవడు సృష్టిస్తాడు. కరెంట్ లేకపోతే ఈ ఫాన్లు ఎవడు సృష్టిస్తాడు. కరెంట్ లేకపోతే ఈ మైకులు ఎవరు సృష్టిస్తాడు కాబట్టి. అన్నింటికిని ఆధారం కరెంట్.

srisatyasai vahamrutam

కరెంటు వుండటంవల్లే ఈ ఆధేయాలన్నీకూడను సృష్టింపబడుతున్నాయి. కనుక ఆధారమైనటువంటి దృశ్యకల్పితమైన జగత్తు అంతా కూడను సృష్టింపబడుతుంది.

**ఆధారాన్ని మరువడమే మూర్ఖత్వం**

ప్రేమస్వరూపులారా! ఆధారాన్ని మనం మొట్టమొదట గుర్తుంచుకోవాలి. ఈ యొక్క ఆధారమనేటువంటి మూలాధారం లేకపోతే దేనిని కూడను మనం సృష్టించలేము. కాని దురదృష్టవశాత్తు ఈనాడు ఆధారాన్ని విస్మరిస్తున్నాం. ఆధేయాన్ని అత్యంత ముఖ్యంగా భావిస్తున్నాం. ఇదియే మూర్ఖత్వం ఇదియే అజ్ఞానం చూశారా! కనుక ఈ ప్రపంచంయొక్క దీనియందు జీవిత సత్యంబు ఎరిగిరి ఎందరో, ఎందుకు వినటం లేదు ఈ మానవుడు? వినలేకున్నావు ఎందుకోసమో అని? ఇది మలినం అని ఎందరో బోధిస్తున్నారు? దీని దగ్గరకి పోవొద్దురా! అని బోధిస్తున్నారు. కాని ఎందుకు పోతున్నాడు. అజ్ఞానం ఇది అని, ప్రజ్ఞానం అది అని చెప్పినప్పటికిని వినిపించుకోలేదు వెఱ్ఱివాడా! ప్రకృతి భావమంతా సంసార సాగరం అని బోధించుతున్నారు వినిపించుకోలేదు. ఓ వెఱ్ఱివాడా! ఎందుకు నీవు వినటం లేదు? కారణం ఏమిటి? కానీ ఇది సత్యం అనేటుది తెలియకుండా పోవడంచేతనే వినిపించుకోవడం లేదు. కనుక ప్రతి విషయాన్ని కూడను మనం చక్కగా గుర్తించాలి. ఆధ్యాత్మికతత్త్వమునందు చక్కని పరివర్తన రావాలంటే మంచి అభ్యాసములు రావాలి. దురభ్యాసములను దూరం చేయాలి. ఈ దురభ్యాసాల చేతనే మానవత్వం దానవత్వం గాను, పశుత్వంగాను, మార్చుకుంటున్నాం. కనుక మనం పశువులం కాదు, మనం రాక్షసులు కాదు. మనుష్య జన్మలు ఎత్తినటువంటి దైవత్వం అట్టి దైవత్వాన్ని ఇంత అపవిత్రమైన మార్గంలో ప్రవేశపెట్టటమా? నరసింహన్ చెప్పాడు. 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం' అని శ్రద్ధను మన సంజయ్ సహాని చెప్పాడు, faith అన్నాడు. శ్రద్ధ faith కాదు, faith శ్రద్ధ కాదు. Faith అనగా నమ్మకం. శ్రద్ధ అనగా ఒక విధమైన ఉత్సాహం. కనుక శ్రద్ధ అనేటువంటి దానికి ఒక విధమైన విశ్వాసం అన్నారు. విశ్వాసం అనేటువంటిది నమ్మకం. శ్రద్ధ అనేటువంటిది interest. కాని interest ఇప్పుడు పోయింది, విశ్వాసం పోయింది. తమోగుణంగా మనం కేవలం ఒక విధమైనటువంటి పశువులకంటే హీనమై పోతున్నాం. కాదు కాదు మానవుడైనందుకు మనం ఇతరులకు ఆదర్శవంతమైనటువంటి నడకలో

sri sathyasai vedamrutam

నేర్పించాలి. లేకపోతే మన దురభ్యాసములు చూచి అందరూ కూడను దూషిస్తారు పరిహసిస్తారు. మానవుల్లో వానికి ఏమాత్రం కూడను చోటు లేకుండా కూడను బయటకు నెట్టి వేస్తారు. సంఘమునకు విరుద్ధమైనటువంటి చర్యలు మనం చేసుకోవటం చేత దేహమునకు విరుద్ధమైనటువంటి చర్యలలో మనం ప్రవేశింప చేసుకోవటం చేత మానవత్వం అనేటువంటిది మాలిన్యం అయిపోతుంది. కనుకనే ఈ మాలిన్యం అనేటువంటి దాన్ని మనం దూరం గావించుకోవాలంటే మానవత్వం అనేటువంటి చింతన మనం చెయ్యాలి. ఈ 25 తత్త్వములు కూడా మనం దూరం గావించుకున్నప్పుడే 26వది అయినటువంటి దైవమే సాక్షాత్కరిస్తాడు. కనుకనే రామదాసు చెప్పాడు.

**మాయకు లోనాయ మాయకు లోనాయ**
**మాయ ఇరవైయైదు మర్మములాయ**
**మాయ ఇరవైయైదు మర్మము కలిపితే**
**మాయ మాయ మాయ మనుగడాయె**

మాయ, మాయ, మాయ, 25 మంత్రములు. ఈ 25 తత్త్వములు కూడను మాయనే. ఇలాంటి మాయతో కూడినటువంటి దాన్ని మనం ఎందుకు అనుసరించాలి? ఈనాడు అట్టా అనుసరిస్తున్నాం. అందువలననే అజ్ఞానం అనేటువంటి దాన్ని మనం ఎక్కువగా కప్పుకుంటున్నాం తెలిసిన ప్రతి మానవునికిని నేను చేసేది ఇది తప్పు అని తెలుసు. నీ కాన్షియస్ నీకు తెలిసికూడను నీవు చెయ్యకుండా పోవటం వల్ల నీవు రాక్షసుని కంటే హీనుడినే. నీ కాన్షియస్‌నే నీవు విరుద్ధంగా తీసినప్పుడు ఇంక బయటివాడి గౌరవం నీకు ఎలా దక్కుతుంది? బయట వారు నిన్ను గౌరవించనపుడు. నీవు జీవించి ప్రయోజనం ఏమిటి? కాదు, మనం సమాజంలో పుట్టాం. సమాజంలో పెరుగుతున్నాము. సమాజంయొక్క గౌరవాన్ని మనం కాపాడుకోవాలి. కేవలం selfish, selfish, selfish. ఈ స్వార్థం స్వార్థమనేటువంటిది మహా పిశాచంగా మారిపోతుంది. కొంతవరకు త్యాగం మనలో బయలుదేరాలి. మనం త్యాగం చేయాలనేదే సత్యం. సత్యమనగా ఏమిటి? స్నేహం కావాలి. ఎవరి స్నేహం, ఏదో వాని స్నేహమో, వీని స్నేహమో అని. ఇది కాదు స్నేహం. అదే దైవంతో స్నేహం కావాలి. అదియే సత్యము. ఆ సత్యమనేటువంటి దానిని మనం సాధిస్తిమా



srisathyasaivachanamrutam

సౌఖ్యాన్నంతా సాధించిన వారమైపోతాం. ఆ సత్యమందే మనకు సౌఖ్యం వస్తుంది. సర్వ సౌఖ్యములు కూడా సత్యంనుండే మనకు వస్తుండాయి. కాని ఈ ప్రాకృతమైనటువంటి సత్యంలోపల నిజంగా సౌఖ్యం లేదు చూశారా! మీకు తెలుసును కుచేలుడు కృష్ణునితో సఖ్యం చేశాడు. బాల్యమునందు. కాని ఇతనికి అనేకమంది బిడ్డలు కలగటం చేత సంసారంలో మునిగి, అనేక బాధలకు గురి అవుతు వచ్చాడు. అయ్యో! ఈ పరిస్థితియందు నన్ను గట్టుకు చేర్చేవారెవరు? నన్ను ఆదరించే వారెవరు? నా కష్టాలు తీర్చే వారెవరని చాలా విచారపడుతూ ఉన్నాడు. బాల్యమునందు కృష్ణునియొక్క స్నేహం గురుకులంలో అతనియొక్క స్నేహం చేశాడు. చెయ్యటం చేత భార్య జ్ఞాపకం చేసింది. ఏమండి? కృష్ణుడు భగవంతుడు కదా! నీకు స్నేహితుడు కూడా కదా! కనుక అతనిని నీవు ఆశ్రయించకూడదా! నీ కష్టములంతా పరిహారమౌతుంది అన్నాది. కాని ఈ కుచేలునికి సంశయం, సంశయం. 'సంశయాత్మా వినశ్యతి'. అతడు నన్ను పలుకరిస్తాడో లేదో. అతడు నన్ను చూస్తాడో లేదో అనేటువంటి సంశయం ఉన్నాది. ఈ సంశయం ఉన్నటువంటి వాడి సందేహమే. సందేహము ఉన్నవానికి అన్నీ హీనమే జరుగుతుంది. 'సంశయాత్మా వినశ్యతి' అన్ని విధాలా నీరసమైపోతాడు. ఈ సందేహము రాకూడదు. కాదు కాదు. ఏదో సామాన్యమైన మానవులు ఎవరైనా మర్చిపోవచ్చును. దైవం మరువడు అనేటువంటి శ్రద్ధ వుండాలి. 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం' ఆ శ్రద్ధ ఉండాలి. ఈ విశ్వాసం ఉండాలి. ఆ విశ్వాసాన్ని బలపర్చుకున్నాడు. వెళ్ళాడు కృష్ణుని దగ్గరికి. ఎవరైనా మరుస్తారు. ఈ బిచ్చగాని వలె పోయినటువంటి కుచేలుని ఎవరు ఆదరిస్తారు. గేటు దగ్గరికి కూడా రానివ్వరు కాని కుచేలుడు వచ్చి ద్వారం దగ్గర నిలచాడు. అనే వార్త విన్నాడు కృష్ణుడు. పరుగెత్తి పోయాడు కృష్ణుడు. కుచేలుని గౌరవించాడు. ఓ మిత్రుడా! ఎంత కాలమైంది నిన్ను చూసి? ఎక్కడున్నావు? ఏ విధంగా ఉన్నావు అని పలుకరించడానికి ఒక కారణం రావాలి కదా. కనుకనే కష్టములయందే ఈ దైవత్వం జ్ఞాపకం వస్తుంది. దీనికి ఒక చిన్న దృష్టాంతం. 13 సంవత్సరములు కూడను అరణ్యవాసం జరిగిన తర్వాత పాండవులు ఇంటికి వచ్చారు. నా కుమారులు సుక్షేమంగా ఇంటికి చేరారు. అన్నటువంటి ఆనందంతో కుంతీదేవి కృష్ణునికి పోయి నమస్కారం చేసింది. అత్తా! నీకు ఆనందమేనా? ఇంకేమి కావాలో కోరుకో నేను ఇస్తాను అన్నాడు, కృష్ణుడు. కృష్ణా! నాకేమీ

sri sathyasai vachanamrutam

అక్కరలేదు. నీయొక్క అండదండలు నీయొక్క ఆప్యాయతలు, నీయొక్క ఆదర్శము. నీయొక్క సమీపత్వము నాకు కావాలి అనుకుంటూ నీవు నాకు నిరంతరము కష్టములనే ప్రసాదించమన్నది. నిజంగా నా కుమారులు అడవిలోపల పడరాని బాధలు పడటం చేతనే, తినరాని తిండ్లు తినటం చేతనే, కందమూలాదులు భుజించటం చేతనే అనేక కష్టములకు గురి అయ్యారు. ఆ కష్టములలో నీవు నిరంతరము కూడను వారికి వెంట, జంట, ఇంట ఉండి కాపాడుతూ వచ్చావు. నీయొక్క సమీపత్వం నాకు కావాలనుకుంటుంటే నాకు కష్టములే ప్రసాదించాలి.

ఇది సత్యసాయియొక్క చరిత్రయందు ఒక చక్కని ఘట్టము ఎవ్వరికి తెలియదు? ప్రతి సంవత్సరము బెంగుళూరులోపల వేసవి తరగతులు జరుగుతుండేవి. పిల్లలు అధికమైపోతున్నారు, వాళ్ళకు ఆధునికంగా తగినటువంటి అనుకూలములు చేయాలని క్రొత్తగా హాస్టలు కట్టడానికి పనులు ప్రారంభించాం. ఆ సంవత్సరములోపల పిల్లలందరిని తీసుకొని నేను ఊటీకి వెళ్ళాను. వేసవి తరగతులు ఊటీలో చక్కగా అన్ని విధములా సౌకర్యంగా, సదుపాయంగా జరిగినాయి. ఇంక రెండవ దినం అందరూ బెంగుళూరుకి రావాలి. నేను పిల్లలకు చెప్పాను. పిల్లలూ ఎట్లైనా మీరు ఊటీకి వచ్చారు. చూడటానికి కన్నులున్నాయి కదా! చక్కగా చుట్టుయున్న ప్రదేశాలన్నీ మీరు చూడటానికి వెళ్ళవలసి వస్తుంది. భగవంతునియొక్క సృష్టి ఎంత విచిత్రంగా కనిపిస్తుందో ఒకసారి మీరు చూసి రండి అని పంపించేను. మాకు అక్కరలేదు. స్వామి కూడా రావాలి అన్నారు. మా పిల్లలు చాలా మొండి పిల్లలు కాని ప్రేమ చేతనే స్వామి మీరు కూడా రావాలి అన్నారు. వారికి నచ్చ జెప్పాను. నాయనా! నేను వచ్చానంటే ప్రజలంతా గుమి గూడతారు. అక్కడ మీకు ఏమాత్రం కూడా సదుపాయం ఉండదు. దృశ్యాలు చూడడానికి కూడ వీలు కాదు. మీరే వెళ్ళి రండి, అన్నాను. కాని పిల్లలకు ఒక విధమైనటువంటి స్వార్థం అనేటువంటిది ఉంటాది. స్వామి కూడా రావాలి లేకపోతే మేము పోము అని కూర్చొన్నారు సరే వెళ్ళండి, అని బస్సులంతా సదుపాయం 'దొడ్డబెట్ట' అనేటువంటి ఒక ప్రదేశం ఉన్నది ఊటీలో. అది 8000 అడుగుల ఎత్తులో ఉంటాది. అది ఊటీలోపల చాలా ఎత్తైన ప్రదేశం కాబట్టి దొడ్డబెట్టకు మీరంతా వెళ్ళి రండి అన్నాను అరే స్వామి రావాలి, అక్కడంతా ఫొటోలు తీసుకోవాలి అది ఇది అని. ఈ

srisathyasaivachanamrutam

కాలం పిల్లలయొక్క అభిరుచులు అట్లా వుంటాయి. సరే మీరందరు పొండి. మీరు బస్సులంతా దిగి అక్కడంతా ఫొటోకు రెడీ అయ్యే లోపల నేను వస్తాను అన్నాను. వారంతా పోయిన తర్వాత అరగంటకు నేను నందనవనం నుంచి దొడ్డబెట్టకు పోతున్నాను. ఎవరో ఇద్దరు పాపం యువకులు, నందనవనంనకు పోయి స్వామిని చూడాలి అని పోయారు. కాని అక్కడ నందనవనంలో లేరు స్వామి దొడ్డబెట్టకు పోయారు అన్నారు. ఆ ఇద్దరు పిల్లలు మోటరుసైకిలుపైన ఒకే స్పీడుగా వచ్చి స్వామిని చూడాలి, చూడాలని ఈ విధంగా స్పీడుగా వస్తున్నారు. వెనకాల ఎవరు ఈ విధంగా వస్తున్నారు ఈ పిల్లలు అనుకునేటప్పటికి కొంతమంది చెప్పారు కార్లో ఎవరో రౌడి పిల్లలు అన్నారు కాదు కాదు తెలియకుండా అలా చెప్పకూడదు. వారు స్వామి దర్శనం కోసం వస్తున్నారు, అన్నాను. ఒక టర్నింగ్ దగ్గరికి వెళ్ళేటప్పటికి వాళ్లు నా కారు ప్రక్కకి వచ్చి నన్ను చూడాలని చెప్పి ఆశ చేత స్పీడుగా దగ్గరికి వచ్చేశారు. దగ్గరికి వచ్చేటప్పటికి మోటరుసైకిలు పడిపోయింది. ఇద్దరు పిల్లలు కూడను మోటరుసైకిలునుండి పడిపోయారు. తక్షణమే నేను కారు ఆపి, నేను వారి దగ్గరికి పోయి, వారికైనటువంటి మట్టినంతా తుడిచి. నాయనా! ఏదైనా దెబ్బ తగిలిందా? ఎందుకోసం ఇంత స్పీడుగా వచ్చారు. ఈ విధంగా రాకూడదు, చూడాలనుకుంటే మీరు నందనవనం రావచ్చును అని వాళ్ళకు చెప్పవలసిన బోధలంతా చెప్పి వారిని సమాధాన పరిచి, నా కారులో యున్నటువంటి రెండు కమలాపండ్లను ఒలచి వాళ్ళకు ఇచ్చి దాహం తీర్చుకోండి అని చెప్పాను. అప్పుడు ఆ కాలేజీ పిల్లలు ఇద్దరు చెపుతున్నారు. స్వామి! మీ దర్శనం కావాలని మేము వచ్చాము. నిజంగా ఈ కష్టం జరగటం చేతనే, మోటర్‌సైకిలు పైనుండి పడిపోవటం చేతనే దర్శనం కాదు, సంభాషణం కాదు, స్పర్శనే కాదు, ప్రసాదం కూడా మాకు లభించింది. నిజంగా మేము క్రింద పడకుండా గాని పోతే స్వామి కారు వదలి మా దగ్గరికి వచ్చి మా తలను నిమిరి మా వీపులంతా నిమిరి ఎక్కడ దెబ్బ తగిలింది ఏమిటని ఇంత ఆప్యాయంగా పలుకరించేవారు ఎవరున్నారు లోకంలో. కనుక స్వామి! మీ దర్శనాన్ని మేము ఆశించాము, శ్రద్ధతో మేము వచ్చాము. దర్శన, స్పర్శన, సంభాషణలు మూడూ జరిగిపోయినాయి మాకు. కనుక, ఈ మూడు లభ్యమయ్యే కోసం ఎన్నిరకమైన కష్టములు మాకు ఇచ్చిన సంతోషమే, మాకు అనుగ్రహించండి అన్నారు, ఇదియే కుంతీ

sri sathyasai vahamrutam

కోరినటువంటిది. ఈ కష్టాలలో భగవంతుడు అంత ఆప్యాయంగా చూచేంత సుఖాలలో చూడడు కాని సుఖములో కూడను చూసేటువంటి అవకాశాలు ఉంటున్నాయి. కనుక భగవంతునియొక్క చూపులకు, కష్టము, సుఖము అనేటువంటిది కాదు. ఆ కుచేలుడు వెళ్ళాడు, ఆ కృష్ణుని భవనంలో చేరాడు. అడగవలసిందేదో అడగనే లేదు. 'మనసెరిగిన మాధవునకు అడగవలసిన అక్కరలేదు'. తిరిగి అంతా భోజనం పెట్టి విశ్రాంతి అయిన తర్వాత కుచేలా నీవు ఇక నీ ఇంటికి వెళ్ళు అని ఒక విధమైనటువంటి పల్లకిని ఇచ్చి పంపించాడు. కొంత దూరం వచ్చిన తర్వాత అయ్యో! ఎంత మూర్ఖుణ్ణి నేను నా పిల్లలు ఏ విధమైనటువంటి ఆహారం లేకుండా, అవస్థలు పడుతున్నారు నేనేమో పంచభక్ష్య పరమాన్నాలంతా భుజించాను. కృష్ణుణ్ణి సహాయం అడగ లేకపోయానే అని పాపం చింతించాడు. కాని ఇంటికి వచ్చేటప్పటికి గొప్ప భవనం ఏర్పడిపోయింది. భార్య సర్వాలంకారములు, అన్ని ఆభరణాలు ధరించింది. పెద్ద రాణి వలె వచ్చింది, ఇతనికి సందేహం వచ్చింది. చూచాడు ఈమె ఎవరో లక్ష్మియో లేకపోతే నా భార్యనా అని సందేహించాడు ఆమె దగ్గరికి వచ్చి నాథా! కృష్ణుడు ఏమన్నాడు? ఇతనికి ఏమీ తోచలేదు. సతీ!

**నా రాక ఎరిగినంతనే వేగ రమ్మని ద్వారపాలుర చేత ఆజ్ఞ అంపె**
**నను జూచినంతనే దిగ్గున గద్దె దిగి నగుమోము తోడ నను అంద జేర్చె**
**బనరించి మోము వాచినట్టు ఎగదిగ జూచి కౌగిట బిగిసికొనియే**
**దేవీ! ఏమందు ఆతని దీనపరత, ప్రేమయే తాను తానే ప్రేమ**
**పేద కుచేలుని అటుకులు తిని, పిడికెడు తిని బహుళ బాగ్యంబు**
**నొసగు వారు కలరె!**

ఎవరిస్తారు పనికి రాని ఇన్ని పిడికెడు అటుకులు తినేసి ఇంత భాగ్యాన్నిచ్చాడు. భగవంతుడు ఆహా! ఇటువంటి భగవంతునియొక్క శక్తిని ఎంత నేను గుర్తించుకోలేకపోయాను. ఎంత మూర్ఖుడను అని తనను తాను నిందించుకొని ఆ గృహమునంతా చూచి, కృష్ణా! ఇదంతా నీ ప్రసాదమే అనుకున్నాడు. కనుకనే హృదయ పూర్వకంగా భగవంతుణ్ణి ప్రేమించినటువంటి వానికి ఎట్టి కొరత వుండదు.

sri sathyasai vahini vacharamrutam

**నమ్మక చెడిన వారలున్నారుకాని**
**నమ్మి చెడిన వారేనాడు లేరటంచు**
**బుధుల వాక్కును మీరాలకించుడోయి**
**సంశమును వీడి సాయిని చేరరోయి.**

కాని దురదృష్టవశాత్తు నమ్మకుండా చెడిపోతున్నారు చాలామంది. ఆ చెడిపోవడం కూడా ఎట్లా. చాలా పెద్ద పర్వతం నుంచి క్రింద పడిపోతున్నట్టుగా పడిపోతున్నారు. అథఃపతనం అయిపోతున్నారు. కాని నమ్మినటువంటి వారు పాతాళం లోకంలో నుంచి కూడాను వైకుంఠానికి తీసుకొని పోతున్నారు. కనుకనే నమ్మకం చాలా ప్రధానం. విశ్వాసాన్ని ఒక ప్రేమతోనే మనం సాధించాలి. దృశ్యమంతా దృక్కు అయిపోతుంది. కనుక ఈ దృశ్యమంతా కూడను దృక్కునుండి వచ్చినటువంటిదే. కనుకనే ఆ ప్రేమ చేతనే సాధించండి గడిచిన నాలుగు దినములు ఆంధ్ర పల్లెల నుండి ప్రజలు వచ్చి. ఇదంతా ఒక విధమైనటువంటి వైకుంఠంగా అనుభవించుకుంటూ పోయారు. చాలా అమాయకులు పల్లెల వారు వారంతా పవిత్రమైన హృదయం కలవారు, ఒక దృఢమైనటువంటి విశ్వాసం కలవారు. భారతీయ సంస్కృతి అనేటువంటిది ఇంకా పల్లెలయందే అంతో ఇంతో ఉంటుండాది. నిజంగా వారు పడినటువంటి ఆనందము ఎంత ఆనందం? ఇట్టిది అట్టిది అని ఎవరూ వర్ణించలేరు. అదే నిజమైన భక్తి. ఈ ఆంధ్రనుంచి వచ్చినటువంటి ఈ ప్రజలయొక్క ఆనందం అందరి హృదయాలను కూడను కరిగించి, కదిలించి, మెదిలించి, పోయినాయి. కనుకనే వారు నిరంతరము సుక్షేమంగా ఆనందంగా దివ్యమైనటువంటి మార్గంలోపల దైవత్వాన్ని అనుభవిస్తారని నేను ఆశిస్తూ, ఆశీర్విదిస్తూ నేను ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 22-10-1998న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasaivacharamrutam